# శయనేషు రంభ...!

"ఏవస్తువైనా చూడగానే కంటికి ఇంపుగా కనిపిస్తే మనసుకి సంతోషంగా వుంటుంది. చూడ్డానికి చక్కగా కనిపించని వస్తువుని అది ఎంతమంచిదైనా స్వీకరించలేం! అలాగే తినే పదార్థాలు కూడా! ఎంత చక్కగా వండిన వంటైనా, చక్కగా అమర్చి శుభ్రతని పాటించి వడ్డిస్తేనే తినగలుగుతాం. అలా కాక, గజిబిజిగా పెట్టి, హడావుడిగా పెట్టినా, చక్కటి గిన్నెలో మూతపెట్టి నీట్‌గా వడ్డించకపోయినా, ఆ పదార్థం ఛస్తే కడుపులోకి పోదు. పెద్దపెద్ద హొటళ్లలో అందంగా అమర్చిపెట్టే భోజనానికి, ఎంత డబ్బయినా పెట్టి వెళతాం.

అలాగే మనిషైనా! అపశంతి పనులు చూస్తూవున్నా, శుభ్రంగా లేకపోయినా వాంతొస్తుంది! 'ఇల్లు చూస్తే ఇల్లాలిని చూడక్కర్లేదు' అనే నానుడి అట్లాగే పుట్టింది. 'ఇల్లే ఇంత చక్కగా అమర్చిన ఇల్లాలు ఇంకా ఎంత చక్కగా వుంటుందో అనుకుంటారట. యాబ్రాసిని చూస్తే అసహ్యం, ఏహ్యభావం కలుగుతుంది'.

ఇన్ని భావాలూ, సామెతలూ, ఇంటినీ ఇల్లాలిని గూర్చి అవతలి వాళ్లే అనుకుంటూ వుంటే, మరి తాళికట్టి ఆమెతో కలిసి సంసారం చేసే భర్త ఏమనుకోవాలి? ఆమె యాబ్రాసిలా వున్నా, శుభ్రత కలిగి లేకపోయినా, అతడు ఆమెవైపు ఆకర్షితుడు కాగలడా? భార్యా భర్తల మధ్య ఆకర్షణ లోపించినప్పుడు అభిమానం కూడా పలచబడుతుంది. అప్పుడు ఆ ఇరువురి జీవితాలూ కేవలం యాంత్రికంగా సాగిపోతాయి! అంతేకాదు! పారేనది పల్లమెరిగి ప్రవహించినట్టూ, పాకే తీగ ఆలంబన కనబడగానే అల్లుకు పోయినట్టూ, బయట తిరిగే మగవాడి మనసు, మరోవైపుకి ఆకర్షింపబడి అల్లుకుపోయే ప్రమాదం వుంది. సాయంకాలాలు చక్కగా స్నానం చేసి, నీట్‌గా డ్రెస్ చేసుకుని, ఆప్యాయంగా భర్త ఆగమనం కోసం ఎదురుచూస్తూ, అతనిని తనవైపుకి ఆకర్షింపజేసుకుంటూ, ఆనందంగా వుండడానికి భార్య ప్రయత్నం చెయ్యాలి! మునీశ్వరులను సయితం ఉసిగొలిపి రెచ్చగొట్టే రంభా, ఊర్వసుల్లాగా, భార్య భర్తని పడకగదిలో ఆకట్టుకోవాలి! గంధం, అత్తరు, పన్నీరు పుష్పాలు వంటి సుగంధ ద్రవ్యాల మత్తులో ముంచి,

వాలు చూపుల వలలో చిక్కుకునేలా చేసి, చిరునగవులతో బంధించి, వొయ్యారాల హొయలలో అడుగు ముందుకు పడకుండా భార్య భర్తని ఆకట్టుకోగలిగితే అతడే ఆమె కొంగు వొదలకుండా తిరుగుతాడు. అంతేకానీ, సాయంత్రం కాగానే తలకి పట్టి కట్టుకుని, (ఈ రోజుల్లో రకరకాల 'బాయ్' లొచ్చాయిలెండి) తలకి దట్టంగా ఏ ఔషదాన్నో పట్టించి, ఏ పాతగుడ్డనో, రంగువెలసిన చీర కేవలం అది శరీరాన్ని కప్పడానికే తప్ప, ఆకర్షణకి పనికి రాదనే ఉద్దేశంతో కట్టుకుని, ముక్కుతూ, మూలుగుతూ ఇల్లాలుంటే, ఆమెని చూస్తే ఆకర్షితుడు కాకపోగా, ఏహ్యభావం కలిగి, ఆమెకు దూరంగా వెళ్లిపోతాడు. మనసు పోరు పెరిగినా, వయసు జోరు హెచ్చినా మరోమార్గం చూసుకుని అడ్డతోవలు తొక్కుతాడు.

చాలామంది భార్యలు, పెళ్లి కాకముందున్న శ్రద్ధ పెళ్లయ్యాక అలంకరణ మీద చూపించరు. అలంకరణ పెళ్లికి మాత్రమే అన్నట్టు. పెళ్లయ్యాక ఎలావుంటే ఏమిటిలే అన్నట్టు ప్రవర్తిస్తారు. అందుకే పురుషుడు ఎప్పుడు మరో పరాయి స్త్రీమీద కన్నేస్తూ వొచ్చాడు. నన్నడిగితే భర్త అలాకావడానికి భార్యే కారణం! ఆమె భర్తని ఆకట్టుకోలేని స్వభావం, నిర్లక్ష్యం, భార్యగా ఆమెకుండే హక్కువల్ల పిచ్చిధైర్యమే ఆమె ప్రవర్తనకి కారణాలు. మరో ముఖ్యమైన కారణం కూడా వుంది. పడక గదిలో ఆమె భర్తతో సమానంగా ఫ్రీగా ప్రవర్తించక పోవడం కూడా? భార్యా భర్తల సంబంధం, మానసికంగా బలపడినా, శారీరక సౌఖ్యం, ఆనందం కూడా కలగజెయ్యాలిగా, తీరని కోర్కెలూ, అర్థం లేని సిగ్గూ లేదా అయిష్టం కూడా వారి దాంపత్యానికి భంగం కలగజేస్తుంది! అందుకే చెబుతున్నాను సుజాతా, 'శయనేషురంభ', అన్న మాటలు గుర్తుపెట్టుకో! నీ భర్తని నీచుట్టూ తిప్పుకో! ఉంటామరీ! ఇప్పటికే చాలా పెద్ద ఉత్తరం రాసేశాను. తల్లిగా కొత్తగా కాపురానికి వెళ్లిన నీకు ఈ విషయాలు చెప్పడం నా బాధ్యతగా భావించి, ఈ విషయాలన్నీ రాశాను. ఉంటామరి.

ఇట్లు

ప్రేమతో మీఅమ్మ విద్యాదేవి.

*